క్లుప్తంగా

పీఏసీఎస్ ద్వారా రైతులకు రుణాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ద్వారా రైతులకు రుణాలు అందజేయనున్నట్లు ఆ సంఘం చైర్మన్ సాబ్లే కిషోర్‌సింగ్, ఉపాధ్యక్షుడు కలాలి వెంకట రమణలు ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్టీ, ఇతర రుణాలను రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. రుణాలు కావాల్సిన రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్, నోడ్యూ సర్టిఫికెట్, సిబిల్‌స్కోర్ జిరాక్స్ ప్రతులతో సంఘం కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వ్యక్తిగత రుణాలు తీసుకున్న వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమాన్ పల్లకి ఊరేగింపు

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో శుక్రవారం హనుమాన్ పల్లకిని ఊరేగించారు. హనుమాన్ దీక్షపరులు భజన గీతాలను ఆలపిస్తూ నృత్యం చేశారు. భక్తిశ్రద్ధలతో ప్రధాన వీధుల్లో పల్లకిని ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. హనుమాన్ స్వాములు కేశవ్ రెడ్డి, రఘురెడ్డి, దాస్, సుభాష్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

నేరడిగొండ: మండల క్రీడాకారులకు అండగా ఉంటామని ఆదివాసీ సంఘం నాయకుడు తొడసం శంకర్ అన్నారు. నేరడిగొండ ప్రిలిమినరీ లీగ్ విజయవంతం కోసం తనవంతుగా రూ.5 వేలను శుక్రవారం మండల కేంద్రంలో నేరడిగొండ క్రికెట్‌క్లబ్ (ఎన్‌సీసీ) సభ్యులకు అందజేశారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు కొదవ లేదని, ప్రోత్సాహం అందిస్తే మరింతగా రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు పవన్, దినేష్, శేఖర్, మణిరాజ్ గణేశ్, జైవంత్, నరేశ్, మురళీ, సిద్ధూ, చందు, నవీన్, చిన్న, తరుణ్, సతీశ్, సుమన్, సచిన్ పాల్గొన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా సాయికుమార్

బోథ్: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఓస సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శిగా కార్తీక్ యాదవ్‌ను నియమించారు. ఈమేరకు శుక్రవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. పార్టీ అభివృద్ధి కోసం తమవంతు అహర్నిశలు పనిచేస్తామన్నారు. యువత బీజేపీ వైపు ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ సుభాష్ సూర్య, మానాల శేఖర్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా అభివృద్ధి

బేల: రాష్ట్ర ప్రభుత్వం కుల మతాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని మణియార్‌పూర్ గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన బుద్ధ విహార్‌ను ఆయన ప్రారంభించారు. గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, ఎంపీపీ తాక్రే వనిత గంభీర్, సర్పంచ్ వడ్కర్ తేజ్‌రావు, జక్కుల మధుకర్, సతీశ్ పవార్, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన వీవీఆర్ వరప్రసాద్‌ను శుక్రవారం బోథ్ బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వామన్ రావ్ దేశ్‌పాండే, కార్యదర్శి పంద్రం శంకర్, న్యాయవాదులు ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయించాలి

బేల: ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయించాలని, విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కారించాలని ఆదిలాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని టాక్లీ గ్రామంలో గత నెల రోజుల రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయడం లేదన్నారు. రాత్రివేళ లోవోల్టేజి ఏర్పడి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అనంతరం ఏఈ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రాకేశ్, నరేందర్, ప్రవీణ్, సురేందర్, అమిత్, నిలేశ్, అవినాష్, అతుల్ పాల్గొన్నారు.

ఒకరికి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: మైనర్ బాలికను వేధించిన కేసులో జడ్జి ఒకరికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ చెందిన పందిరి సంతోశ్ మైనర్ బాలికను వేధించడంతో ఆమె తండ్రి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి జడ్జి ఎదుట హాజరుపర్చగా శుక్రవారం రిమాండ్ విధించారు.

చినుకు.. రైతుల్లో వణుకు

- మొక్కజొన్నకు మొలకలు
- ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ఈయన పేరు తూము సూర్యం. బోథ్ మండల కేంద్రం. తనకున్న పదెకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. యాసంగిలో పది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంటను కోసి చేనులోనే ఉంచాడు. మరుసటి రోజు హార్వేస్టర్ యంత్రంతో పట్టించాలనుకున్నాడు. ఇంతలోనే వర్షాలు కురవడంతో పంట పూర్తిగా తడిసింది. దీంతో మొక్కజొన్నకు మొలకలు వచ్చాయి. దెబ్బతిన్న పంటకు పరిహారం అందించాలని, ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరుతున్నాడు.



బోథ్‌లో తడిసిన మక్కలు

బోథ్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటపై వర్షాలు కన్నెర్ర చేస్తున్నాయి. ఎండాకాలంలో వానలు కురవడంతో పంటలు చేతికివచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో చేతికివచ్చిన పంట వర్షార్పణం అవుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న పంట పరిస్థితి ఆందోళనకరంగా మారింది. పొలాల్లోనే పంట ఉండడంతో రైతులు దిక్కులేని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం పంటలను కొనడానికి సిద్ధమైనా.. వర్షాలు కురవడంతో పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. మొక్కజొన్న కంకులపై మొలకలు రావడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.



మొక్కజొన్న కంకిపై మొలకలు

పెరిగిన సాగు..తగ్గిన దిగుబడి..

జిల్లాలో మొక్కజొన్న సాగు ఈఏడాది గణనీయంగా పెరిగింది. జిల్లాలో సాధారణ సాగు 4,559 ఎకరాలు ఉంది. కాగా గత ఏడాది 6,063 ఎకరాల్లో రైతులు మొక్కజొన్నను సాగు చేశారు. గత ఏడాది మొక్కజొన్నకు ధర రూ. 2,500గా ఉండడంతో ఈఏడాది రైతులు ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. ఈఏడాది ఏకంగా 14,415 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. గతేడాది ఎకరాకు 40– 45 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. ఈసారి 30– 35 క్వింటాళ్ల లోపే వచ్చింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోలు చేయాలి



వర్షాల వల్ల మొక్కజొన్న పంట తడిచింది. కంకులపై మొలకలు వస్తున్నాయి. దీని వల్ల పంట దిగుబడి తగ్గిపోయింది. వర్షాలకు తడిచిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఎలాంటి నిబంధనలు పెట్టకుండా రైతులను ఆదుకోవాలి.

– ఇప్ప లక్ష్మణ్, బోథ్

కొనుగోళ్లలో ఆలస్యం..

మొక్కజొన్న కొనుగోళ్లను ప్రారంభించినా.. పూర్తిస్థాయి కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ అధికారులు ఇంకా ప్రారంభించ లేదు. గ్రామాల వారీగా కొనుగోళ్లకు సంబంధించిన ప్లాన్‌ను కూడా సిద్ధం చేయలేదు. ఒకవైపు వర్షాలు కురుస్తుండడంతో కొనుగోళ్ల ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. వర్షాలు తగ్గిన తరువాతనే కొనుగోళ్ల పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం

- చిట్యాల సుహాసినిరెడ్డి
- గండ్ర సుజాత ఇంటి వద్ద బీజేపీ నాయకుల నిరసన
- డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ నివాసం వద్ద ఉద్రిక్తత



గండ్రత్ సుజాత ఇంటి ఎదుట హనుమాన్ చాలీసా పఠిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. బజరంగ్ దళ్ సంస్థను నిషేధిస్తామని కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఏఐసీసీ సభ్యురాలు సుజాత ఇంటి ఎదుట శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. హిందువులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హనుమాన్ చాలీసాను పఠించి, గండ్రత్ సుజాత ఇంట్లోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇదే సమయంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు బీజేపీ నాయకులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. అదే విధంగా బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ఇంటి ముందుట హనుమాన్ చాలీసా పఠనం చేయడానికి యత్నించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా మీడియా ఇన్‌చార్జి మడ్డే సురేందర్, జనరల్ సెక్రెటరీ పద్మవార్ రాకేశ్, పట్టణ అధ్యక్షుడు శివగౌడ్, సచిన్, గోపి, రాజు, శివ, సూర్య కిరణ్ పాల్గొన్నారు.

మత రాజకీయాలు దేశానికే ప్రమాదకరం

- డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్



మాట్లాడుతున్న సాజిద్ ఖాన్

ఆదిలాబాద్: మత రాజకీయాలు దేశానికే ప్రమాదకరమని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బజరంగ్‌దళ్ నిషేధం వివాదం నేపథ్యంలో బీజేవైఎం నాయకులు సాజిద్ ఖాన్ ఇంటి ఎదుట హనుమాన్ చాలీసా పఠనం చేసి నిరసన తెలియజేసేందుకు యత్నించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ మతంతో పాటు అన్ని మతాలను గౌరవిస్తామని, హిందువులను మతతంత్వంతో వాడుకునే విధానాలను మాత్రమే నిరసిస్తామని స్పష్టం చేశారు. బీజేవైఎం, బీజేపీ నాయకులు తన నివాసం ఎదుట స్వచ్ఛందంగా హనుమాన్ చాలీసాను పఠించవచ్చని ఇందు కోసం ఏర్పాట్లను సైతం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గుడిపల్లి నగేశ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మోతీ రామ్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ రాహుల్ చంద్రాల, రాజు యాదవ్, సాధిక్, రసూల్ భాయ్, జుబేర్ పాల్గొన్నారు.

108లో ప్రసవం

సిరికొండ: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన జయశ్రీ అనే గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈఎంటీ రాకేశ్, పైలెట్ వినోద్ ఉన్నారు.

ఘనంగా కారల్‌మార్క్స్ జయంతి

ఎదులాపురం: ప్రపంచంలోని అనేక దేశాల్లో కారల్‌మార్క్స్ కమ్యూనిజం అనేక మార్పులు తీసుకొచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుంటాల రాములు, నర్సింగ్ రావు, గణేశ్, ముకుంద్‌రావు, మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

ఎదులాపురం: మార్క్సిజంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, గంగన్న, మంజుల, సుజాత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

8న ఆలయ వార్షికోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని సాయినగర్ దస్నాపూర్‌లో గల రేణుకా మాత (ఎల్లమ్మ) ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఈనెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవ వేడుకలను ఆదిలాబాద్ గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరామర్శ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని గోండ్‌గూడలో ఇటీవల గుండెపోటుతో జైస్వాల్ సంతోశ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి శుక్రవారం గోండ్‌గూడ గ్రామానికి సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంతోశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధంజలి ఘటించారు.

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ముత్యం రెడ్డి సోదరుడు బండారి భోజన్న ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్‌లు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీఎల్‌వోలతో సమావేశం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహశీల్దార్ మోహన్‌సింగ్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో నూతన నమోదు, మార్పులు చేర్పులు చేసే విధంగా బీఎల్‌వోలు కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాయవతి వైఖరి తెలియచేయాలి

ఉట్నూర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ అధినేత్రి మాయవతి వైఖరి తెలియజేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ అన్నారు. శుక్రవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ఈనెల 7న హైదరాబాద్ రానున్న నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై మాట్లాడాలన్నారు. నాయకలు దాసరి రాంప్రసాద్, దొండిరాం పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం

బోథ్: మండలంలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆత్రం యాదవ్, శ్రీనివాస్, గోపాల్‌లు బదిలీ కావడంతో వారిని సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రవీందర్, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్నలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న, సర్పంచ్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

సిరికొండ: సిరికొండ మండల కేంద్రం నుంచి వాయిపేట్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఏబీసీ రీసెర్చ్ డిపాట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. మండలం ఏర్పాటు చేసి ఆరు సంవత్సరాలు అవుతున్నా.. బస్సు సౌకర్యం కల్పించలేదన్నారు.

అంగన్‌వాడీలో ఎడ్యుకేషన్ డే

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో– 7లో శుక్రవారం ఎడ్యుకేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో చేరే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరి, అంగన్‌వాడీ టీచర్ కవిత, జ్యోతి, మౌనిక, ఆశ కార్యకర్త శ్రీదేవి, ఝరి నర్సయ్య, రుక్సార్ బేగం, సుమయ్య, తబుస్సుం, ఆస్మా తబుస్సుం, షాహీన్ పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆదిలాబాద్: వైశాఖ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవాలయం (మంగమఠం)లో శుక్రవారం శ్రీరమా సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 108 జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేయించారు. అనంతరం మహా ప్రసాద కార్యక్రమం చేపట్టారు. ఆలయ అర్చకుడు వైభవ్‌శర్మ దూబే మాట్లాడుతూ.. స్వామి వారి పాదాలను తాకే అద్భుత ఘట్టం ఆలయంలో ఆవిష్కృతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వామన్ రావు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తలమడుగు: మండలంలోని కొత్తూరు దుర్గామాత ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, వెంకటేశ్, మొట్టే కిరణ్, పల్లవి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



మాట్లాడుతున్న శేఖర్ మహరాజ్

నేరడిగొండ: మండలంలోని తన్యతండా (చిన్నరాజుర) గ్రామంలో జగదాంబ దేవి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పొరదేవి శేఖర్ మహరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మల కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భక్తులు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయంలో కల్యాణం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



తాంసి: రిజిస్టర్‌లు అందజేస్తున్న వైద్యాధికారి

తాంసి: గర్భిణుల ఆరోగ్యంపై ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు దృష్టి సారించాలని భీంపూర్ వైద్యాధికారి నిఖిల్ రాజు సూచించారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో మాతాశిశు సంరక్షణలో భాగంగా వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారికి ఎల్ఎంపీ రిజిస్టర్లు అందజేశారు. ప్రతీ గర్భిణీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవి, ఫార్మాసిస్ట్ రాందాస్, ఏఎన్ఎంలు సరస్వతి, విజయలక్ష్మీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలి

ఇచ్చోడ: గర్భిణులకు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడంలో జాప్యం చేయవద్దని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో పాటుగా, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పర్యటించి, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

బోథ్: ఈనెల 7న హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు చిలుముల పంచాక్షరి కోరారు. ఈసందర్భంగా బోథ్ మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. దొరల గడీలను బద్దలు కొట్టడానికి ప్రతిఒక్కరూ సభకు హాజరుకావాలని కోరారు. జాతీయ అధ్యక్షురాలు మాయవతి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దశరథ్, నవీన్, గంగాధరి పవన్, రవి, నగేశ్, రజినీకాంత్, సురేందర్, ప్రశాంత్, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాంసి: బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించే తెలంగాణ భరోసా సభలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీఎస్పీ భీంపూర్ మండల కన్వీనర్ డెగే ఛత్రపతి కోరారు. శుక్రవారం మండలంలోని పిప్పల్‌కోటిలో గ్రామస్తులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించే సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి హాజరవుతున్నట్లు తెలిపారు. బీఎస్పీ నాయకులు రమేశ్, అశోక్, సత్యనారాయణ, షేక్ చోటు, దేవన్న, సంతోశ్ పాల్గొన్నారు.

బుద్ధుడి మార్గం అనుసరణీయం



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌రూరల్: పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: బుద్ధుడి మార్గం అనుసరణీయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధ వీహార్‌లో బుద్ధుడి జయంతిని నిర్వహించారు. అంబేద్కర్, బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో బుద్ధ వీహార్ నుంచి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధ పౌర్ణమి సభ అధ్యక్షుడు దుర్గం శేఖర్, బాబాసాహెబ్ కాంబ్లే, శాలిక్‌రావ్ నాగారాడే, సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు దయానంద్ ఘోట్కురే, శైలేందర్ వాఘ్మరే, రాంకిషన్, శోభబాయి, కౌన్సిలర్ సంగీత రాంకుమార్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో గల మహా ప్రజ్ఞ బుద్ధ విహార్‌లో బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచశీల ధ్వజారోహణ చేసి, బుద్ధ వందన గావించి తథాగత్ గౌతమ్ బుద్ధుడి, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజ్ఞా కుమార్ రత్నజాడే, సోగల సుదర్శన్, వార్డు కౌన్సిలర్ బండారి సతీశ్, ఉదయ్ కుమార్, దుర్గే ఆనందరావు, శీలానంద్ రాహుల్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో బుద్ధుడి జయంతిని బౌద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రతిఒక్కరూ బుద్ధుని బోధనలు పాటించాలని ఆల్ ఇండియా బుద్ధిస్ట్ సొసైటీ మండల అధ్యక్షుడు పాటిల్ అమృత్ అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మునేశ్వర్ సోమన్న, బౌద్ధ మహాసంఘ అధ్యక్షుడు భౌరె మల్లయ్య, భగత్, ప్రవీణ్, రాహుల్, సంఘపాల్, లోలపు పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలని దళిత సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖానాపూర్ నియోజకవర్గ భీం ఆర్మీ అధ్యక్షుడు పరత్యాగ్ దత్త, దళిత సంఘాల నాయకులు వావల్కర్ శివాజీ, కాలే శివాజీ, సూర్యవంశీ ఉత్తం, జోందలే విజయ్, సుద్ధోదన్, మారుతి, జివనే, సోమోరే నాగోరావ్, కాంబ్లే అనిల్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో ధమ్మ చక్ర పరివర్తన దివస్‌ను ఘనంగా నిర్వహించారు. బుద్ధ విహార్‌లోని బుద్ధ విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ మాధవ్ మస్కే, గోవింద్ బుద్దే, మాధవ్ ససానే, సిద్ధార్థ్ ససానే, కిషన్ బుద్దే, మిలింద్, కుశాల్, అజయ్ పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏఈవో

బోథ్: రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచి విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని మర్లపెల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రైతువేదికలో రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రలోభాలు గురిచేసి విత్తనాలను అంటగట్టే వారిని పోలీసులకు అప్పగించాలన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. రైతులు విత్తేటప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.